వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

కందుకూరులో దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కందుకూరు మార్చి 11: ఎస్సీ వర్గీకరణ చేపట్టిన అనంతరం ఉద్యోగ నియామకాలు చేపట్టాలని మాజీ ఎంపీపీ పెద్ద రామయ్య, ఎమ్మార్పీఎస్ ,మండలాధ్యక్షుడు మల్లెపల్లి కృష్ణ మాదిగ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు అన్ని రకాల ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కోరుకుంటున్న దళితులకు అన్యాయం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ నాయకులు జంగయ్య మాదిగ, మంద పాండు, మాదిగ జంగయ్య మాదిగ, కృష్ణ మాదిగ, తాండ్ర బాలయ్య మాదిగ, రాములమ్మ పాల్గొన్నారు.

గిరిజనులు అభివృద్ధి చెందాలి

హుస్సేన్ నాయక్‌ను సన్మానిస్తున్న గిరిజనులు

కందుకూరు మార్చి 11: ప్రభుత్వ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్ తెలిపారు. రాష్ట్ర గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్‌ను బీజేపీ మండలాధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ,ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరారు. గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ మోర్చా మండల అధ్యక్షులు శ్రీశైలం నాయక్, సురసాని భూమిరెడ్డి ,చిలుకల రఘునందన్, భాస్కర్ నాయక్, బాలు నాయక్, రాజు నాయక్ ,భాను ప్రకాశ్, కిరణ్, వినోద్ ,రాజ్‌కుమార్ ,రాజు, పాల్గొన్నారు.

దరఖాస్తు స్వీకరణ గడువు పొడగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని ఫ్యాకల్టీ ల కేటగిరి-2 పీహెచ్డీ సీట్ల భర్తీకి నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసేందుకు గడువును పొడిగించినట్లు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. రూ.2000 అపరాధ రుసుముతో ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చేనెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

ప్లంబర్ల సంక్షేమానికి కృషి చేస్తా

లేబర్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, మార్చి 11 : ప్లంబర్ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం ప్లంబర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులకు లేబర్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నిర్మాణంలో ప్లంబర్ల పాత్ర కీలకమన్నారు. కార్మికులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలను వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనిల్ చౌదరి, మాధవరం నర్సింహరావు, సతీశ్‌కుమార్ గౌడ్, రవిముదిరాజ్, రాఘవేంద్రరావు, మనోజ్, కృష్ణ, శ్రీశైలం, రాజుగౌడ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రా లేఔట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నగేశ్

ఆర్కే పురం, మార్చి 11 : చిత్రలేఔట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పెండ్యాల నగేశ్ ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా పెండ్యాల నగేశ్ గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా గణేశ్, కోశాధికారిగా మల్లి కార్జున్ గెలుపొందారు. ఈ సందర్భంగా పెండ్యాల నరేశ్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు. కాలనీలోని సమస్యలను ప్రజా ప్రతినిధుల, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం పాటుపడుతానన్నారు. తన మీద నమ్మకంతో గెలిపించిన కాలనీ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారికి నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. తన గెలుపునకు సహకరించిన కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్ మార్చి 11: మలక్ పేట నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం సాయంత్రం పాతబస్తీలోని తన క్యాంప్ కార్యాలయంలో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందజేయడానికి క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ నాయక్‌కు రివార్డ్ అందజేత

గోపాల్ నాయక్‌ను అభినందిస్తున్న ఎక్సైజ్ ప్రొహిబిషనరీ డైరెక్టర్ కమలహాసన్ రెడ్డి

సైదాబాద్ మార్చి 11 : మలక్ పేట ఎక్సైజ్ ప్రొహిబిషనరీ ఇన్‌స్పెక్టర్ గోపాల్ నాయక్ కు రాష్ట్ర ఎక్సైజ్ ప్రొహిబిషనరీ డైరెక్టర్ కమలహాసన్ రెడ్డి నగదు బహుమతిని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ గోపాల్ నాయక్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో 2017లో పనిచేస్తున్న సమయంలో 4 కిలోల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్న కేసులో నిందితులకు 2023 లో మెదక్ సెషన్స్ కోర్టులో 10 సంవత్సరాల జైలు శిక్షతోపాటు లక్ష రూపాయలు జరిమానా విధించింది అని తెలిపారు. నేరాలను అదుపు చేయడంలో విశేష కృషితో పాటు, విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో ఉన్నతాధికారులు నగదు బహుమతి అందజేసి అభినందించారని ఆయన తెలిపారు. నగదు బహుమతితో మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు.

రంగారెడ్డి జిల్లా కోర్టు జీపీ గా తిరుమల్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా కోర్టులు,11 మార్చి: రంగారెడ్డి జిల్లా కోర్టు నూతన ప్రభుత్వ న్యాయవాది(జీపీ)గా సీనియర్ న్యాయవాది బానాల తిరుమల్‌రెడ్డిని నియమిస్తూ తెలంగాణ న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమల్ రెడ్డిని ప్రభుత్వ న్యాయవాదిగా నియమించడంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజేందర్‌రెడ్డి, పులిగారి గోవర్ధన్‌రెడ్డి, సముద్రాల శ్రీనివాస్ రావు, గోకుల్ రామారావు, సదానందం, బుచ్చిరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

దశల వారీగా అభివృద్ధి పనులు

సిరిగిరి పురంలో అభివృద్ధి పనులను చేయిస్తున్న నాయకులు

బడంగ్‌పేట్, మార్చి 11: మహేశ్వరం మండల పరిధిలోని సిరిగిరిపురంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. దశలవారీగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఇటీవల ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించడంతో అధికారులు పనులు మొదలు పెట్టారని బీఆర్ఎస్ నేతలు తెలిపారు. మహేశ్వరం మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు శ్రీను, సిరిగిరిపురం గ్రామ శాఖ అధ్యక్షుడు కుండే రాములు, సిరిగిరిపురం మాజీ సర్పంచ్ తడకల పోచయ్య, మాజీ ఎంపీటీసీ ఆవ కొమురయ్య, బండ రాజేందర్ , శ్రీను , సత్యనారయణ చారి , పాండు చారి , నరసింహ, బాబు , దాసయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

గుమ్మడవెల్లిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్లు

కందుకూరు ,మార్చి 11: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ ప్రభాకర్, వైఆర్‌జీ స్వచ్ఛంద సంస్థ హెల్త్ క్యాంప్ రంగారెడ్డి జిల్లా రిసోర్స్ పర్సన్ రామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారు 80 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజలకు వివిధ రకాల వ్యాధులను పరీక్షించి కావలసిన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు ప్రజలకు వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పేదలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఐటీటీసీ కౌన్సిలర్ అనిల్ కుమార్, టెక్నీషియన్ రాఘు లింక్ వర్కర్ రజిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఫార్మసీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంఫార్మసీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ రెండో సెమిస్టర్ వన్ టైం ఛాన్స్ బ్యాక్లాగ్ పరీక్షలను ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ లో చూసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చూడాలి

తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్

ఆర్కేపురం, మార్చి 11: సరూర్‌నగర్ డివిజన్ సర్వే నంబర్ 24 లో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి కోరారు. మంగళవారం సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధి సర్వేనంబర్ 24 లోని ప్రభుత్వ భూమిని తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చూడాలన్నారు. ప్రజలకు చెందిన ఈ భూములు అక్రమంగా ఇతరుల చేతికి వెళ్లకుండా కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, అర్హులైన నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. ప్రభుత్వ హౌసింగ్ స్కీమ్ కింద అర్హులైన ప్రజలందరికీ హక్కు ఉన్న నివాసం అందించేందుకు కృషి చేయాలని తెలిపారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్

హయత్ నగర్, మార్చి 11: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హయత్ నగర్ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో నక్క వెంకటమ్మ, యాదగిరి స్వామి యాదవ్ , స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ నక్క శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ దేశాన్ని ముందుకు నడిపించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఇందిర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు అభినందనలు..

సైదాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని డిప్యూటీ ఐఓఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ ఐఓఎస్ హరినారాయణ సీఆర్పీలు కౌసల్య ,సుజాత,దీపిక, అపర్ణలను శాలువాలతో సత్కరించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఎంతో ఓపిక ఉంటుందని వారు మండల స్థాయిలో చేస్తున్న కృషిని కొనియాడుతూ అభినందించారు. ఈ కార్యక్రమంలో దారుల్ షిఫా అంధబాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకటరెడ్డి, ఖలీల్ అహ్మద్,



సీఆర్పీలను సన్మానిస్తున్న డిప్యూటీ ఐఓఎస్ హరి నారాయణ

దేశసంపదను దోచిపెడుతున్న మోదీ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

బడంగ్‌పేట్, మార్చి 11 : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను, నరేంద్ర మోదీ సర్కార్ కార్పొరేట్లకు దోచిపెడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. దేశ సంపద లూటీ చేస్తున్నారని వాపోయారు. కార్పొరేట్లు మోదీకి భజన చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని తుక్కుగూడ లక్ష్మీ గార్డెన్ లో సీపీఐ జిల్లా స్థాయి సెమినార్‌ను మంగళవారం నిర్వహించారు. సీపీఐ నాయకులు, ఎర్రజెండాలు చేత పట్టి కవాతు చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై కళాకారులు పాటలు పాడారు. ప్రధానమంత్రి మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో పేద ప్రజల ఆర్థిక పరిస్థితి దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ల సంపద వందరేట్లు పెరిగిందని పేర్కొన్నారు. జీఎస్టీ పేరుతో పేదల మీద 97 శాతం పన్నులు వసూలు చేస్తున్నారని అన్నారు. దేశంలో ఖనిజ సంపద ప్రకృతి సంపదలను కార్పొరేట్లు యథేచ్ఛగా దోచుకుపోతున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాస్వామిక వాదులపై దాడులు పెరిగిపోయాయని ప్రముఖ జర్నలిస్టు పాశం యాదగిరి అన్నారు. ప్రముఖ సైకాలజిస్ట్ లక్ష్మణ్ మాట్లాడుతూ మానసిక దృఢత్వంతో మంచి ఆలోచనలు, మంచి వ్యక్తిత్వం కలిగిన వారు దేనినైనా సాధిస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడిగా సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య వ్యవహరించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి,రాష్ట్ర సమితి సభ్యులు పుస్తకాల నర్సింగ్‌రావు,పానుగంటి పర్వతాలు,ముత్యాల యాదిరెడ్డి, రామస్వామి, మహేశ్వరం నియోజకవర్గం దత్తు నాయక్, కావలి నరసింహ ఓరుగంటి యాదయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, రామకృష్ణ, ప్రబలింగం, జంగయ్య, బాతరాజు నరసింహ, పబ్బతి లక్ష్మణ్, శ్రీను, యాదగిరి, నీలమ్మ,బాలాపూర్ మండల కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, పల్నాటి యాదయ్య, రాజు , దేవేంద్ర గౌడ్ బ్రహ్మచారి, యాదగిరి,తదితరులు పాల్గొన్నారు

చైన్ స్నాచింగ్ కేసును ఛేదించిన పోలీసులు

పోలీసుల అదుపులో నిందితుడు

మన్సూరాబాద్, మార్చి11: నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసును ఇరవై నాలుగు గంటల్లో పోలీసులు ఛేదించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలం, లక్ష్మీ తండా గ్రామపంచాయతీ, భూక్య తండా కు చెందిన భూక్య శ్రీనివాస్ వృత్తిరీత్యా కూలీ పని చేస్తుంటాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన శ్రీనివాస్ పలువురి దగ్గర అప్పులు తీసుకున్నాడు. అప్పులు తీర్చాలని ఒత్తిడి రావడంతో.. దొంగతనాలు చేయాలని పతకం వేసుకున్నాడు. హయత్ నగర్ పరిధిలోని పలు గ్రామాల్లో రెక్కీ నిర్వహించాడు. తట్టి అన్నారం, మర్రిపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు స్వరూప ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించాడు. ఈనెల 10న ఉదయం 11 గంటల సమయంలో స్వరూప ఇంట్లో పడుకొని ఉండగా ఆమె వద్దకు వచ్చిన నిందితుడు శ్రీనివాస్ వృద్ధురాలి మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును అపహరించుకొని పారిపోయాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల్లో లభించిన ఆధారాలతో నిందితుడు ఉపయోగించిన బైక్ నంబర్‌ను తెలుసుకున్నారు. తట్టి అన్నారం చౌరస్తాలో మంగళవారం ఉదయం నాగోల్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా యాక్టివా బైక్ పై అటువైపుగా వచ్చిన శ్రీనివాస్ కదలికలు అనుమానాస్పదంగా కనిపించాయి. శ్రీనివాస్ ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా దొంగతనం విషయం బయటపడింది. వృద్ధురాలు స్వరూప మెడలో నుంచి అపహరించిన నాలుగు తులాల బంగారు గొలుసును నిందితుడి వద్ద నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 24 గంటల్లో చైన్ స్నాచింగ్ కేసులు ఛేదించిన నాగోల్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

అప్రమత్తంగా ఉండాలి

రికార్డులను తనిఖీ చేస్తున్న రాచకొండ సీపీ సుధీర్ బాబు

ఎల్బీనగర్ మార్చి 11: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి రాచకొండ పోలీసులు కమిషనర్ సుధీర్ బాబు మంగళవారం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని స్థానిక ప్రజలతో మమేకమై వారి స్పందనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

పైప్‌లైన్ సౌకర్యం కల్పించండి

జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కలిసిన కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

హయత్ నగర్, మార్చి 11 : నగర శివారు ప్రాంతమైన హయత్ నగర్ డివిజన్ పరిధిలోని నూతనంగా వెలిసిన పలు కాలనీ లలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని ఆయన కార్యాలయంలో హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కలిసి వినతి పత్రం అందజేసినట్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హయత్ నగర్ డివిజన్ శివారు ప్రాంతమైన పలు కాలనీలలో డ్రైనేజీ, తాగునీటి కోసం ఆయా కాలనీల వాసులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, హయత్ నగర్ డివిజన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించి శివారు కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంట పలు కాలనీల అధ్యక్ష,కార్యదర్శులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలంలో భూ దందా

బోడుప్పల్, మార్చి 11: బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలోని 12, 13 డివిజన్లోని ప్రభుత్వ స్థలానికి రాత్రికి రాత్రే రెక్కలు వస్తున్నాయని బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ ఆరోపించారు. మంగళవారం గౌతమ్‌నగర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బోడుప్పల్ సర్వే నంబ ర్ 63 బై 28 నుంచి 63 బై 39 లో 1984 సంవత్సరంలో లేఔట్ ఏర్పాటు చేశారు. కానీ అది ప్రభుత్వ స్థలం అని అధికారులు నిర్ధారించి అందులోని క్రయవిక్రయాలను నిలిపివేశారని తెలిపారు. కాంగ్రెస్ నాయకుల అండదండలతో 30 అక్రమ నిర్మాణాలు చేపట్టారన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్ రెడ్డి

సైదాబాద్, మార్చి 11: సైదాబాద్ డివిజన్ పరిధిలోని మాధవ నగర్ లో రూ. 8 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు నిర్మాణాన్ని సరైన పద్ధతిలో నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని జీహెచ్ఎంసీ అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, కాలనీవాసులు తిరుమలరెడ్డి , అపర్ణ ,నీలిమ, మానిక్ రెడ్డి, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

భవనాన్ని కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

సైదాబాద్ మార్చి 11: చావుని డివిజన్ పరిధిలోని కుర్మగూడలో అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని మంగళవారం జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. అక్రమ భవన నిర్మాణం పై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో న్యాయస్థానం అక్రమ నిర్మాణ భవనాన్ని కూల్చివేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవటంతో న్యాయ స్థానం ధిక్కార ఆదేశాల మేరకు అధికారులు కొంతమేరకు కూల్చివేత పనులను కొనసాగించారు. కూల్చివేత పనులను మలక్ పేట సర్కిల్ జయంత్ పరిశీలించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఎల్బీనగర్, మార్చి 11: పేకాట శిబిరం పై పోలీసేలు దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... సోమవారం ఇంటి నంబర్ 21-74, వీవీ నగర్ బస్ స్టాప్ దగ్గర కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారున్న సమాచారంతో సరూర్ నగర్ సీఐ, సైది రెడ్డి , ఎస్ఐ మారయ్య వెళ్లి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 35,360 లు, 12 మొబైల్ ఫోన్లను స్వాదీనం చేసుకొని వారిని సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి వారిని రిమాండ్ కి తరలించారు. పేకాట ఆడితే చట్ట పరమైన చర్యలు తప్పవని సరూర్ నగర్ సైది రెడ్డి తెలిపారు